సాక్షి ఆదిలాబాద్

బుధవారం : 22 : ఫిబ్రవరి : 2023



అందుబాటులోకి 'పంచతత్వ'

జిల్లాకేంద్రంలోని గాంధీపార్కులో ఏర్పాటు చేసిన పంచతత్వ ఆక్యుప్రెషర్ పార్కు అందుబాటులోకి వచ్చింది. ఎమ్మెల్యే రామన్న మంగళవారం ప్రారంభించారు. 9లో▸



'ఆహార భద్రత' పకడ్బందీగా అమలు చేయాలి

ఆహార భద్రత చట్టం పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ కె.తిరుమల్‌రెడ్డి అన్నారు. గుడిహత్నూర్ మండలంలో ఆయన పర్యటించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం 37.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు బోథ్‌లో ఇద్దరు మంత్రుల పర్యటన

కైలాస్‌నగర్: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు, రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జిల్లాలోని బోథ్ నియోజకవర్గంలో బుధవారం పర్యటించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్మల్ నుంచి బయలుదేరి 11గంటలకు బోథ్‌కు చేరుకుంటారని పేర్కొన్నారు. అక్కడ నిర్మించే 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. అనంతరం స్థానికంగా జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2గంటలకు బోథ్ నుంచి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారని వెల్లడించారు.

బోథ్ అస్థిత్వాన్ని కాపాడండి



మంత్రి హరీశ్‌రావుకు ట్వీట్ చేసిన చంటి

బోథ్: బోథ్ అస్థిత్వాన్ని కాపాడేందుకు కృషి చేయాలని కోరుతూ మంత్రి హరీశ్‌రావుకు కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి మంగళవారం ట్వీట్ ద్వారా విన్నవించారు. ఈమేరకు ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని జత చేశారు. నియోజకవర్గ కేంద్రాన్ని డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, అలాగే డీఎస్పీ కార్యాలయం బోథ్‌లోనే ఏర్పాటు చేయాలని, ఫైర్‌స్టేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, మండల కేంద్రం నుంచి వెళ్లిపోయిన కార్యాలయాలను తిరిగి ఏర్పాటు చేయాలని ట్వీట్‌లో పేర్కొన్నారు. బోథ్‌కు మంత్రి నేడు రానున్న నేపథ్యంలో ట్వీట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కైలాస్‌నగర్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు రాజు, దేవేందర్, కాంతరావు, మురళి పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు


ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 వరకు దరఖాస్తు గడువు ఉండగా, మార్చి 1 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశంతో పాటు 7 నుంచి 10వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే అత్యుత్తమ గ్రేడ్ సాధించవచ్చని అదనపు పాలనాధికారి రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. అలాగే పాఠశాలలో మన ఊరు మన బడి కింద కొనసాగుతున్న పనులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి నర్సయ్య, ఉపాధ్యాయులు నారాయణ, తదితరులున్నారు.



గత మార్చిలో రిమ్స్ సిబ్బందితో సెల్ఫీ దిగిన వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

అమాత్యా.. ఆలకించరూ

- సర్కారు ఆసుపత్రుల్లో వైద్యపోస్టులు ఖాళీ
- రిమ్స్, సీహెచ్‌సీలలోనే అధికం
- ఇంకా అందుబాటులోకి రాని ఎంఆర్‌ఐ
- వైద్యసేవలపై ప్రభావం
- నేడు జిల్లాకు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు రాక
- బోథ్ సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

రిమ్స్‌లో పోస్టుల వివరాలు..

పోస్టులు	మంజూరు	భర్తీ	ఖాళీలు
ప్రొఫెసర్	21	14	07
అసోసియేట్ ప్రొఫెసర్	30	16	14
అసిస్టెంట్ ప్రొఫెసర్	41	36	05
ట్యూటర్	56	34	22
మొత్తం	148	100	48

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో..

అసిస్టెంట్ ప్రొఫెసర్ మొత్తం పోస్టులు	52
భర్తీ అయినవి	09
ఖాళీగా ఉన్నవి	43

ఉట్నూర్ సీహెచ్‌సీ పోస్టుల వివరాలు..

పోస్టులు	మంజూరు	భర్తీ	ఖాళీలు
సివిల్ సర్జన్ స్పెషలిస్ట్	04	00	04
డిప్యూటీ సివిల్ సర్జన్	08	00	08
సివిల్ అసిస్టెంట్ సర్జన్ (దీంట్లో నలుగురు కాంట్రాక్ట్‌పై పనిచేస్తున్నారు)	21	15	06
డెంటల్ అసిస్టెంట్ సర్జన్	01	01	00

బోథ్ సీహెచ్‌సీ పోస్టుల వివరాలు..

పోస్టులు	మంజూరు	భర్తీ	ఖాళీలు
సివిల్ సర్జన్ స్పెషలిస్ట్	01	00	01
డిప్యూటీ సివిల్ సర్జన్	01	00	01
సివిల్ అసిస్టెంట్ సర్జన్	11	03	08
డెంటల్ అసిస్టెంట్	01	00	01



బోథ్ సీహెచ్‌సీ నూతన భవన డిజైన్

సాక్షి,ఆదిలాబాద్: 'అమాత్యా.. గతేడాది మార్చి 3న మీరు ఆదిలాబాద్ జిల్లాకు వైద్యారోగ్యశాఖ మంత్రిగా విచ్చేశారు. ఆ రోజున రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మీ చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లాలో వైద్య సేవలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మళ్లీ పదకొండున్నర నెలల తర్వాత జిల్లాకు విచ్చేస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చాలా వరకు వైద్యుల పోస్టులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణులకు సకాలంలో వైద్యసేవలు అందక మాతాశిశు మరణాలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో ప్రధానంగా రిమ్స్, సూపర్ స్పెషాలిటీతో పాటు మూడు సీహెచ్‌సీలలో వైద్య పోస్టులు ఖాళీగా ఉండడం వైద్యసేవలపై ప్రభావం చూపుతోంది.

నేడు మంత్రి హరీశ్‌రావు రాక..

రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు బుధవారం జిల్లాకు వస్తున్నారు. బోథ్ సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. రూ.10.56 కోట్లతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో పాటు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొననున్నారు.

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ గాడిలో పడేదెలా..

ఒకప్పుడు ఉమ్మడి జిల్లా ప్రధాన ఆస్పత్రిగా ఆదిలాబాద్ హాస్పిటల్‌ను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008లో బోధనాస్పత్రిగా మార్చి రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)గా నామకరణం చేశారు. 100 ఎంబీబీఎస్ సీట్లతో మొదలై ప్రస్తుతం 120 సీట్లకు పెరిగింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంతో పాటు పీజీ చదువుకు సైతం సీట్లు మంజూరయ్యాయి. అయితే సూపర్ స్పెషాలిటీ ఇంకా గాడిలో పడటం లేదు. కార్డియోలజీ, యూరాలజీ, న్యూరో సర్జన్, పీడియాట్రిక్ సర్జన్, రేడియోలజీ, కార్డియో థొరాసిక్ సర్జన్, న్యూరాలజీ, నెఫ్రాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మెడికల్ అంకాలజీ నిపుణుల పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ కాలేదు. అప్పట్లో మంత్రి హరీశ్‌రావు ఈ ఆస్పత్రికి ఎంఆర్‌ఐ యంత్రం మంజూరు చేశారు. అయితే ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణం కోసం భూమి పూజ చేసినప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు. రిమ్స్‌లో ట్యూటర్ పోస్టులు అధికంగా ఖాళీగా ఉన్నాయి. దీంతోపాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది.

సీహెచ్‌సీల పరిస్థితి ఇది..

జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి తర్వాత మూడు సర్కారు పెద్దాస్పత్రులు ఉట్నూర్, బోథ్, నార్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వైద్య పోస్టులు భర్తీ చేయకపోవడంతో అక్కడ పేద రోగులకు సేవలు అందని పరిస్థితి. నార్నూర్ ఆస్పత్రిని సీహెచ్‌సీగా ఆరు నెలల క్రితం అప్‌గ్రేడ్ చేసినా ఇప్పటివరకు పోస్టుల సంఖ్య కూడా మంజూరు లేదు. ఇక బోథ్, ఉట్నూర్ ఆస్పత్రుల్లోనూ పలు ముఖ్యమైన వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బోధనాస్పత్రుల్లో 1400 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుంది. తద్వారా రిమ్స్‌లో కొన్ని పోస్టులు భర్తీకి నోచుకునే అవకాశం లేకపోలేదు. అయితే ఈ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల పోస్టుల భర్తీపై మంత్రి దృష్టి సారించాలన్న అభిప్రాయం జిల్లా వాసుల్లో వ్యక్తమవుతుంది.

సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాపూరావ్

బోథ్: రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు,ఇంద్రకరణ్‌రెడ్డి నేడు మండల కేంద్రానికి విచ్చేయనున్నట్లు ఎమ్మెల్యే బాపూరావ్ పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు సభాస్థలిని మంగళవారం ఆయన పరిశీలించారు.



ఇది ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం కోసం నూతనంగా నిర్మిస్తున్న భవనం. రూ.3.5కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ నిర్మాణానికి ప్రస్తుత ఎమ్మెల్యే జోగు రామన్న 2017లో మంత్రి హోదాలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆరేళ్లవుతున్నా ఇంకా పూర్తికాలేదు. ప్రస్తుత పాలకవర్గం అధికారంలోకి వచ్చి కూడా మూడేళ్లు గడిచిపోయాయి. ఇప్పటికీ ఈ భవనం అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

బేస్‌మెంట్ దశలో.. పిల్లర్లతో కనిపిస్తున్న ఈ చిత్రం స్థానిక కైలాస్‌నగర్‌లో పట్టణ ప్రగతి నిధులు రూ. 2కోట్లతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం. కాంట్రాక్టర్ గతేడాది డిసెంబర్‌లో పనులు చేపట్టగా.. పిల్లర్ల వరకు వేగంగా పూర్తయ్యాయి. బిల్లులు మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ఈ నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉండగా.. తాజా పరిస్థితి చూస్తే గడువులోగా పూర్తవడం కష్టంగానే కనిపిస్తోంది.



పూర్తయ్యేదెప్పుడో..!?



పిల్లర్లు తుప్పుపట్టే దశకు చేరిన ఈ నిర్మాణం జిల్లా కేంద్రంలోని సాత్నాల క్వార్టర్స్ స్థలంలో చేపట్టిన సమీకృత మార్కెట్‌ది. చికెన్, మటన్, చేపలు వంటి మాంసహార ఉత్పత్తులన్నీ వినియోగదారులకు ఒకే చోట అందుబాటులో ఉండేలా రూ.7.20 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ నిర్మాణానికి 2021 డిసెంబర్ 23న ఎమ్మెల్యే రామన్న భూమి పూజ చేశారు. బేస్‌మెంట్ దశవరకు కాంట్రాక్టర్ పనులను వేగంగా చేపట్టారు. గతేడాది దసరాకు దీన్ని ప్రారంభిస్తామని అప్పటి కలెక్టర్ సహా మున్సిపల్ అధికారులు ప్రకటించారు. కానీ కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు ఇలా పిల్లర్లదశకే పరిమితమయ్యాయి.

- నిధులు రాక నిలిచిన నిర్మాణాలు
- ఏళ్లుగా సా..గుతున్న అభివృద్ధి పనులు
- బిల్లులందక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- ప్రేక్షకపాత్రలో అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతికి సంబంధించి మచ్చుకు ఇవి కొన్ని మాత్రమే. జిల్లా కేంద్రంలో చాలా వరకు నిధులు లేక నిర్మాణాలు ఇలా అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. కాంట్రాక్టర్లు పనులు కొంత వరకు చేపట్టి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో చేసేది లేక నిలిపివేస్తున్నారు. పదే పదే గడువు పెంచుతున్నా పనులు మాత్రం పూర్తికాని పరిస్థితి.

ప్రేక్షకపాత్రలో అధికారులు

జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చూడాల్సిన ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు. కాంట్రాక్టర్ చే పట్టిన పనులకు ఎంబీ రికార్డులు నమోదు చేసి బిల్లులను ట్రెజరీలో సమర్పిస్తున్నారు. అయితే ఆ నిధుల ను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్‌పై వారు ఎలాంటి అజమాయిషీ చేయలేకపోతున్నారు. బిల్లులు ఎప్పుడు వస్తే అప్పుడు పనులు చేస్తామనే ధోరణిలో కాంట్రాక్టర్లు ఉండగా, వారు చేసినప్పుడే తాము చూస్తామనేలా అధికారుల తీరు కనిపిస్తుంది. ఫలితంగా భవన నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరిగి ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి. పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదలయ్యేలా చూడాల్సిన అధికారులు ఆ దిశగా చొరవ చూపడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఫలితంగా ఏళ్ల తరబడి నిర్మాణ పనులు నత్తనడకన సా..గుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి

- సమీకృత మార్కెట్, ఇండోర్ స్టేడియం నిర్మాణాల్లో పురోగతి లేకపోవడంపై మున్సిపల్ డీఈ తిరుపతిని సంప్రదించగా ట్రెజరీలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. బిల్లులు విడుదలైన వెంటనే పనులను ప్రారంభిస్తామని చెప్పారు.
- మున్సిపల్ కార్యాలయ భవనం ఎప్పటి వరకు పూర్తవుతుందని ఆర్‌అండ్‌బీ డీఈ సురేశ్ రాథోడ్‌ను అడుగగా ఈ నెలాఖరులోగా పూర్తిచేస్తామన్నారు. పనులు తుది దశకు చేరాయని చెప్పడం గమనార్హం .

లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా ఖైదీలకు న్యాయం

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే

ఆదిలాబాద్‌టౌన్: జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా న్యాయం పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులతో కలిసి మంగళవారం జిల్లా జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు వారి హక్కులపై అవగాహన కల్పించారు. కారాగారంలోని ఖైదీలు ఏదైనా కేసులో బెయిల్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు వారి ఆర్థిక స్థితి, అక్షరాస్యత ఆధారంగా వివక్ష చూపకూడదని తెలిపారు. పరిస్థితి మేరకు కొన్ని కఠినమైన షరతులను సడలించడానికి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సర్వీసెస్ సెల్ న్యాయవాదులు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహారం, ఆరోగ్య సేవలు, పరిశుభ్రత, ఆహార పదార్థాలను పరిశీలించారు. డీఎల్ఎస్ఏ అందించే న్యాయవాది ద్వారా ప్రతి ఖైదీ న్యాయ సేవలు పొందేందుకు అర్హులని వివరించారు. ఆమె వెంట లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ స్కీమ్ ప్రధాన న్యాయవాది గంగారాం దాసరి, ఉప సహాయ న్యాయవాది అశోక్, సహాయ న్యాయవాది ఉమేష్, జైలర్, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.



జిల్లా జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే

నేడు తలమడుగులో న్యాయ అవగాహన సదస్సు

కైలాస్‌నగర్: జాతీయ ఆహార భద్రత చట్టం–2013పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న తలమడుగులో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు స్థానిక రైతు వేదిక భవనంలో నిర్వహించే సదస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి

- అధికారులతో ఎమ్మెల్యే రామన్న సమీక్ష

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలంలోని తర్నం గ్రామం వద్ద ఇటీవల పగుళ్లు తేలిన తరోడ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే జోగు రామన్న అధికారులకు సూచించారు. పట్టణంలో నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తరోడ బ్రిడ్జి ఇటీవల పగుళ్లు తేలి కుంగిపోయిందని, ముందస్తు జాగ్రత్తగా వంతెన గుండా రాకపోకలను నిలిపివేసినట్లు తెలిపారు. అయితే 18 నెలల క్రితమే జాతీయ రహదారి 353(బి) నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ పరిధి నుంచి కేంద్రం స్వాధీనంలోకి తీసుకుందన్నారు. జాతీయ రహదారితో పాటు వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, ఈమేరకు పూర్తి సహకారం అందిస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి తదితరులున్నారు.

27 మంది రేషన్ డీలర్ల ఎంపిక

- ఏప్రిల్ నుంచి షాపుల నిర్వహణ బాధ్యతలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ షాపులకు డీలర్లుగా ఎంపికైన అభ్యర్థుల వివరాలను మంగళవారం ప్రకటించారు. 12 మండలాల పరిధిలోని 27 షాపులకు గతేడాది డిసెంబర్ 12నుంచి ఈ ఏడాది జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 348మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే నెల 22న రాత పరీక్ష నిర్వహించారు. 27న ఆర్డీవో ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆ వెంటనే ఫలితాలు ప్రకటించాల్సి ఉండగా కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో ఫలితాల వెల్లడిలో జాప్యమైంది. కోర్టు కేసు ముగియడంతో ఎంపికైన 27 మంది అభ్యర్థుల వివరాలు ప్రకటించినట్లు ఆర్డీవో రమేశ్ రాథోడ్ తెలిపారు. వీరు సంబంధిత తహసీల్దార్ల ద్వారా ఆథరైజేషన్ లెటర్లను పొందాల్సి ఉంటుందన్నారు. వాటిని తీసుకున్న అనంతరం వారికి అపాయింట్‌మెంట్ లెటర్లతో పాటు డీఎస్‌వో ద్వారా పీఓఎస్ మిషన్లతో పాటు శిక్షణ అందించి ఏప్రిల్ నుంచి షాపుల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని పేర్కొన్నారు.

వార్షికోత్సవ హంగామా



బోథ్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా సాంస్కృతిక వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. డీఐఈవో రవీందర్ పాల్గొన్నారు.

'పుర' గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన కమిషనర్

కైలాస్‌నగర్: పట్టణ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరించేందు కోసం నిర్వహిస్తున్న పుర ప్రజావాణికి స్పందన లభిస్తోంది. వారం వారం అర్జీల సంఖ్య పెరుగుతోంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన పుర ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. కమిషనర్ శైలజ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ వారం మొత్తం 50 అర్జీలు అందగా ఇందులో అత్యధికంగా రెవెన్యూ సెక్షన్‌కు సంబంధించినవి 33 ఉన్నాయి. అలాగే టౌన్ ప్లానింగ్ సంబంధించినవి 7, ఇంజనీరింగ్ విభాగం 5, శానిటేషన్ 2, మెప్మాకు సంబంధించినవి 3 చొప్పున ఉన్నాయి. వాటిని పరిశీలించిన కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్ దివాకర్, టీపీవో అనురాధ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ శైలజ

సైన్స్‌పై పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

- డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సైన్స్‌పై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం సైన్స్ ప్రతిభాపోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మూఢ నమ్మకాలను వీడి శాస్త్రీయ దృక్పథం వైపు పయనించాలని సూచించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ, ఇందులో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 25న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఇందులో జెడ్పీఎస్ఎస్ నేరడిగొండకు చెందిన ఎస్.ప్రియ, జెడ్పీఎస్ఎస్ సరస్వతినగర్ విద్యార్థి కె.సృష్టి ప్రథమ స్థానంలో నిలిచారు. తలమడుగు జెడ్పీఎస్ఎస్‌కు చెందిన ప్రణయ్, కుచులాపూర్ పాఠశాలకు చెందిన కృష్ణ కన్నయ్య, జెడ్పీఎస్ఎస్ జైనథ్‌కు చెందిన హరిప్రియ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్‌రెడ్డి, చంద్రశేఖర్, సైన్స్ అధికారి రఘురమణ, అదనపు సైన్స్ అధికారి భాస్కర్, సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


గోరేకర్ శ్యాంరావ్‌(ఫైల్‌)

భైంసాటౌన్‌: భార్య అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై ఎండీ గౌసుద్దీన్‌ వివరాల ప్రకారం... భైంసా మండలంలోని కుంబి గ్రామానికి చెందిన గోరేకర్‌ శ్యాంరావు (40) భార్య పద్మాబాయి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో భైంసాలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఈ నెల 16న ఆస్పత్రిలోని భార్యకు టిఫిన్‌ తీసుకువచ్చి బయటకు వెళ్లిన శ్యాంరావు తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం భైంసాలోని ఎస్‌ఆర్‌ గార్డెన్‌ సుద్దవాగు ఒడ్డు సమీపంలో కుళ్లిన స్థితిలోని మృతదేహం ఉందన్న సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కుటుంబీకులకు సమాచారమిచ్చారు. దీంతో వారు చేరుకుని మృతదేహం శ్యాంరావుదేనని గుర్తించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో సంఘటన స్థలంలోనే వైద్యులతో పోస్టుమార్టం చేయించారు. భార్య అనారోగ్యం, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

- రూ.2వేల జరిమానా

ఆదిలాబాద్‌టౌన్‌: బాలికపై లైంగికదాడికి పాల్పడి కొడుకు జన్మించడానికి కారణమైన నేరస్తుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి మాధవికృష్ణ మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్‌ అధికారి పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నార్నూర్‌ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తన తల్లి మృతి చెందడంతో చదువు మానేసింది. ఆరోగ్యం బాగలేక పోవడంతో తన బంధువైన మైలారపు పృథ్వీరాజ్‌ ఇంట్లో ఉంటోంది. ఇంట్లో ఎవరులేని సమయంలో ఆయన పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి పలుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో ఆమెకు కడుపునొప్పి రావడంతో వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. దీంతో గర్భిణీ అని నిర్ధారించారు. ఈ విషయాన్ని తన తండ్రికి చెప్పడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు కాగా పీపీ రమణా రెడ్డి 11మంది సాక్ష్యులను విచారించి నేరం రుజువు చేయగా ఈ మేరకు జడ్జిపై విధంగా తీర్పునిచ్చినట్లు వివరించారు.

మనస్వినికి 'నాట్యనంది' పురస్కారం


పురస్కారం అందుకుంటున్న మనస్విని

నిర్మల్‌: జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారి మనస్విని తన నాట్యంతో ఆకట్టుకోవడమే కాకుండా నాట్యసేవానంది పురస్కారాన్ని అందుకుంది. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌కు చెందిన బచ్చు కళ్యాణి, ప్రసాద్‌ దంపతుల కుమార్తె మనస్విని కూచిపూడిలో రాణిస్తోంది. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శిఖరం ఆర్ట్స్‌ థియేటర్‌ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయగానసభలో శివోహం పేరిట నృత్యప్రదర్శన నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మనస్విని ప్రతిభ కనబర్చి నాట్యనంది సేవాపురస్కారాన్ని అందుకుంది.

చదువుకు చేయూత


అంతర్గాంలో తన గౌరవ వేతనాన్ని ఇస్తున్న సర్పంచ్‌


పొన్నారి పాఠశాలలో బోధన చేస్తున్న విద్యావలంటీర్‌ మహేశ్వరి

- పాఠశాలలో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- స్వచ్ఛందంగా విద్యావలంటీర్లను ఏర్పాటు చేస్తున్న దాతలు
- తీరుతున్న ఉపాధ్యాయుల కొరత
- పలు గ్రామాల్లో విద్యార్థుల చదువుకు తోడ్పాటు

తాంసి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా.. పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు చదువులో ప్రతిభ కనబర్చాలని ప్రత్యేకంగా కార్యాచరణ చేపడుతున్నప్పటికీ ఉపాధ్యాయుల కొరతతో లక్ష్యం నెరవేరడం లేదు. అయితే కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు సైతం పలువురు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయల కొరత ఉన్న చోట దాతలు విద్యావలంటీర్లను ఏర్పాటు చేసి వారికి వేతనం అందజేస్తూ విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తూ చదువుకు చేయూతనిస్తున్నారు.

పొన్నారి పాఠశాలలో..

మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ హరీష్‌రెడ్డి ఈ విషయం తెలుసుకుని విద్యావలంటీర్‌ను ఏర్పాటు చేశాడు. ఈ పాఠశాలలో మొత్తం ఐదు తరగతులు నిర్వహిస్తుండగా 106 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. అమెరికాలో స్థిరపడిన హరీష్‌ రెడ్డి ఏడాదిగా విద్యార్థుల కోసం పాఠశాలలో గ్రామానికి చెందిన మహేశ్వరి అనే యువతిని విద్యావలంటీర్‌గా నియమించాడు. ప్రతి నెల రూ.5వేల గౌరవ వేతనం తన తండ్రి ఆనంద్‌ ద్వారా అందిస్తున్నాడు.


విద్యార్థులకు బోధిస్తున్న వలంటీర్‌ రజిత

వడూర్‌ పాఠశాలలో..

భీంపూర్‌ మండలంలోని వడూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో 90మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభం నుంచి పాఠశాలలో గ్రామస్తులు గ్రామాభివృద్ధి కమిటీ తరఫున ఇద్దరు గ్రామానికి చెందిన డిగ్రీ పూర్తిచేసిన అంకిత, శిరీషను విద్యావలంటీర్లుగా నియమించారు. వీరికి ప్రతినెలా గ్రామాభివృద్ధి కమిటీ తరఫున ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నారు.

అంతర్గాంలో...

భీంపూర్‌ మండలంలోని అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీకాంత్‌ గ్రామస్తుల సహకారంతో విద్యావలంటీర్‌ను నియమించాడు. పాఠశాలలో మొత్తం 114 మంది విద్యార్థులు ఉండగా కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండగా ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పంపించారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్యకు సరిపడా లేకపోవడంతో గ్రామస్తులు అంతా కలిసి పాఠశాలకు విద్యావలంటీర్‌గా రజితను ఆరు నెలల క్రితం నియమించారు. ఆమెకు గౌరవ వేతనం అందించడానికి పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్‌ తనవంతుగా రూ.5వేలు, గ్రామ సర్పంచ్‌ బక్కి లలిత రెండు నెలల తన గౌరవ వేతనం రూ.10వేలు, అదే విధంగా పాఠశాల పూర్వ విద్యార్థులు తల కొంత డబ్బులను పోగుచేశారు. జమచేసిన డబ్బుల్లోంచి విద్యావలంటీర్‌కు ప్రతినెలా రూ.3500 వేతనంగా అందిస్తున్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి


లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ, పశువైద్యాధికారులు

భైంసారూరల్‌: మండలంలోని కుంబి గ్రామ శివారులో చిరుతపులి దాడిలో లేగదూడ మృతిచెందింది. చుచుంద్‌ గ్రామానికి చెందిన రాజేశ్‌ అనే రైతు లేగదూడను కుంబి శివారులోని వ్యవసాయ పంటపొలంలో కట్టేసి ఉంచాడు. మంగళవారం ఉదయం రాజేశ్‌ పంటపొలానికి వెళ్లగా లేగదూడ మృతిచెంది కనిపించింది. దీంతో రాజేశ్‌ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. అటవీశాఖ, పశువైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. లేగ దూడపై చిరుతపులి దాడిచేసిందని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. కుంబి, చుచుంద్‌ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారి ఇర్ఫానోద్దీన్‌ సూచించారు.

పత్తి చోరీ

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలోని పంటచేనులో ఉంచిన పత్తి మూటలను సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. గ్రామానికి చెందిన రైతు సత్యనారాయణ తన పత్తిపంట చేనులో కూలీల ద్వారా తీసిన మూడు క్వింటాళ్ల పత్తిపంట మూటలను పంటచేనులో నిల్వ చేశాడు. నిల్వ చేసిన పత్తి మూటలను తీసుకురావడానికి మంగళవారం ఉదయం వెళ్లగా పంటచేనులో పత్తి మూటలు కన్పించలేదు. అలాగే మరో క్వింటాల్‌ కంది పంట సైతం ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన పత్తి విలువ దాదాపు రూ.30వేల వరకు ఉంటుందని రైతు వాపోయాడు.

యూత్‌ కాంగ్రెస్‌ నిరసన

ఆదిలాబాద్‌టౌన్‌: వరంగల్‌ యువజన నాయకుడు తోట పవన్‌పై దాడిని నిరసిస్తూ యువజన కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ఉద్రిక్తంగా మారింది. వరంగల్‌ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ మంగళవారం యువజన కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో బస్టాండ్‌ఎదుట రాస్తారోకో చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మ దహనం కోసం యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో యువజన కాంగ్రెస్‌ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు చరణ్‌ గౌడ్‌ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి చేపడుతున్న పాదయాత్రను చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్‌ నాయకులు తమ పార్టీ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో యూత్‌ కాంగ్రెస్‌ అసెంబ్లీ అధ్యక్షుడు ఆర్బాత్‌, ఉపాధ్యక్షుడు నాహిద్‌, ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌ రెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ భూపెల్లి శ్రీధర్‌, మావల మండల అధ్యక్షుడు శేఖర్‌, భీంసరి ఉపసర్పంచ్‌ మల్లయ్య, ఫహీమ్‌, మోసిన్‌ పటేల్‌, తాహెర్‌ ఖాన్‌ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు కావాలి

- జిల్లా పరిషత్‌ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌

బజార్‌హత్నూర్‌: ప్రతీ గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రతీ క్రీడాకారుడు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆదిలాబాద్‌ జిల్లా పరిషత్‌ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని జాతర్ల గ్రామంలో నవజ్యోతి యూత్‌ క్లబ్‌ 46వ వార్షికోత్సవం సందర్భంగా అంతర్రాష్ట్ర క్రీడల ముగింపు కార్యక్రమంలో మాజీ ఎంపీ గొడం నగేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌ మాజీ ఎంపీ గొడం నగేశ్‌ మాట్లాడారు. ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మా స్వగ్రామం జాతర్లలో నవజ్యోతి యూత్‌క్లబ్‌ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించామని వివరించారు. జాతర్ల గ్రామంలో ఎంపీ నిధుల ద్వారా మినీ స్టేడియాన్ని నిర్మించామని, ప్రోకబడ్డీని తలదన్నెలా ఏర్పాట్లు చేసి 2016 జనవరి 7, 8, 9 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలు విజయవంతమయ్యామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రూ.2కోట్ల నిధులతో జాతర్ల గ్రామంలో 12 ఎకరాలలో కేంద్రీయ క్రీడా పాఠశాల ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్‌లో జాతీయస్థాయి గ్రామీణ క్రీడలను నిర్వహించగలమనే ధీమా వచ్చిందని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమం ఎంపీపీ తుల శ్రీనివాస్‌, జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, గొడం చందన్‌, మడవి కృష్ణారావ్‌, ఆత్రం భాస్కర్‌, సహకార సంఘం చైర్మన్‌ మేకల వెంకన్న, సర్పంచ్‌లు లక్ష్మి నాగోరావ్‌, ఎంపీటీసీ పెందుర్‌ ఈశ్వర్‌, రాజేశ్వర్‌, అల్కే గణేష్‌, నానం రమణ, చిల్కూరి భూమన్న, లక్కం రాములు, కొత్త శంకర్‌, నందు, గోపాల్‌, గంగారాం, రవీందర్‌, కళ్యాణ్‌, వినోద్‌ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌

ఇంట్లో పాతిపెట్టిన గుడుంబా స్వాధీనం


పొన్కల్‌లో గుడుంబాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్‌ సిబ్బంది


నేరడిగొండ: నాటుసారాను ధ్వంసం చేస్తూ..

మామడ: గుడుంబాను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్‌ అధికారులు వెళ్లి ఇంటిని ఎన్నిసార్లు వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సమాచారం మేరకు ఎక్సైజ్‌ అధికారులు తనిఖీ చేయగా ఇంటిలోపలి గదిలోని భూమిలో ప్లాస్టిక్‌ డ్రమ్ములను ఉంచి పైనుండి ఎవరికి అనుమానం రాకుండా సిమెంట్‌ స్లాబ్‌ వేసి అందులో నిల్వ చేసిన గుడుంబాను పట్టుకున్నారు. ఎక్సైజ్‌ అధికారుల వివరాల ప్రకారం... పొన్కల్‌ గ్రామానికి చెందిన తోకల సాయన్న ఇంటిలోని గదిలో గోతిని తవ్వి అందులో ప్లాస్టిక్‌ డ్రమ్ముల్లో గుడుంబా ప్యాకెట్‌లను నిల్వ చేసి ఉంచాడు. వాటిపై సిమెంట్‌ స్లాబ్‌ వేయించాడు. సిమెంట్‌ స్లాబ్‌పై బియ్యం బస్తాలను ఉంచి అవసరమైనప్పుడు తీసి విక్రయిస్తున్నాడు. ఎక్సైజ్‌ అధికారులు సిమెంట్‌ను తొలగించి భూమిలోపల నుంచి డ్రమ్ములను బయటకు తీశారు. అందులోని 10లీటర్‌ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రాయదారితండా, మామడతండా, పొన్కల్‌ గ్రామాల్లో గుడుంబా విక్రయ కేంద్రాలపై ఎక్సైజ్‌ అధికారులు తనిఖీలు నిర్వహించి 30 లీటర్లు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఒకరు పరారీలో ఉండగా మిగితా ఐదుగురు తహసీల్దార్‌ కార్యాలయంలో బైండోవర్‌ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎక్సైజ్‌ సిబ్బంది ప్రకాష్‌, రవీందర్‌, భాస్కర్‌, రాజశేఖర్‌, నిరోష, రషీద్‌, ప్రకాష్‌, రవీందర్‌ పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు

నేరడిగొండ: నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆబ్కారీ శాఖ జిల్లా స్క్వాడ్‌ లక్ష్మణ్‌ రావ్‌ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రోల్‌మామడ గ్రామంలో తనిఖీలు చేశారు. నోలే సరస్వతీ, రాయిచంద్‌ల వద్ద 40 లీటర్ల ఇప్ప పువ్వు పానకాన్ని ధ్వంసంచేశారు. 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

ఎనిమిది మంది యువకుల బైండోవర్‌

- తల్లిదండ్రులకు డీఎస్పీ కౌన్సెలింగ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని వన్‌టౌన్‌ పోలీసుస్టేషన్‌ ఎదుట ఘర్షణకు దిగిన ఎనిమిది మంది యువకులను వన్‌టౌన్‌ సీఐ సత్యనారాయణ బైండోవర్‌ చేశారు. ఆదిలాబాద్‌ అర్బన్‌ తహసీల్దార్‌ ఎదుట మంగళవారం హాజరుపర్చారు. ఇటీవల ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ర్యాలీలో దాడులకు దిగిన యువకులు మరోసారి సోమవారం రాత్రి పోలీసుస్టేషన్‌ ఎదుట బాహాబాహికి దిగారు. దీంతో అజయ్‌, సాజన్‌, సృజన్‌, రవితేజ, భానుతేజ, శివరామకృష్ణ, రోషన్‌, సృజన్‌లపై కేసు నమోదు చేశారు. వీరికి ఆదిలాబాద్‌ డీఎస్పీ ఉమేందర్‌ వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్‌ నిర్వహించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా మరోమారు వ్యవహరిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బైండోవర్‌ అయిన యువకులపై ఆరు నెలల్లోపు మరోసారి ఏదైన కేసు నమోదైతే రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బేల: మండలంలోని పాటన్‌ గ్రామానికి చెందిన యువకుడు గోడే ప్రవీణ్‌(22) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని పాటన్‌ గ్రామానికి చెందిన గోడే మారోతికి ఏకైక కుమారుడు ప్రవీణ్‌ ఇంటర్‌ పూర్తిచేశాడు. ఏ పని లేకుండా తిరగడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ప్రవీణ్‌ సోమవారం రాత్రి క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లింగన్న తెలిపారు.

చెరువులో యువకుడి గల్లంతు

భైంసారూరల్‌: తానూరు మండలం బోల్సా గ్రామానికి చెందిన లక్ష్మణ్‌(22) ఇలేగాం చెరువులో గల్లంతైనట్లు భైంసారూరల్‌ ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... బోల్సా గ్రామానికి చెందిన లక్ష్మణ్‌, షేక్‌ హైమద్‌లు దేగాం గ్రామానికి వెళ్లాడు. అక్కడి నుంచి తిరుగుపయణంలో ఇలేగాం కొత్త చెరువు వద్ద స్నానానికి దిగి గల్లంతయ్యాడు. చెరువులో మునిగిన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం చీకటి పడేవరకు చెరువులో గాలించిన ఆచూకీ లభించలేదు.

కుటుంబీకుల అనుమానం...

బోల్సా గ్రామం నుంచి షేక్‌హైమద్‌ అనే వ్యక్తితో లక్ష్మణ్‌ కలిసి వెళ్లాడని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. చెరువు వద్ద స్నానానికి వెళ్లితే బట్టలు, చెప్పులు ఒడ్డుపై ఎక్కడ కనిపించడం లేదని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మణ్‌ నీటిలో గల్లంతయ్యాడా... మరేమైనా జరిగి ఉంటుందా అనే విషయంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


చెరువులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని విద్యానగర్‌ కాలనీలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. కాలనీకి చెందిన గేడం మునీష్‌ కుమార్‌ ఈనెల 19న రాత్రి 7.30 గంటల సమయంలో తన ఇంటి ముందు పల్సర్‌ బైక్‌ పార్కింగ్‌ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూసే సరికి బండి లేకపోవడంతో చుట్టుపక్కలా గాలించాడు. ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం టూటౌన్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్‌ ఎస్సై విష్ణుప్రకాష్‌ తెలిపారు.

కొనసాగుతున్న పిప్పల్‌కోటి రైతుల దీక్ష

తాంసి: పిప్పల్‌కోటి రిజర్వాయర్‌ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం చెల్లించాలని రైతులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం రిలే దీక్షలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ వెంటనే పరిహారం అందించాలని డిమాండ్‌ చేశారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను రిజర్వాయర్‌ నిర్మాణంలో కోల్పోతున్నామన్నారు. దీంతో ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిహారం పెంచి అందజేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో రైతులు రాజన్న, మల్లేశ్‌, పోశెట్టి, జనార్దన్‌ ఉన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

- ఎంపీ సోయం బాపురావ్‌


ఎంపీ బాపురావ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆదిలాబాద్‌రూరల్‌: 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యే జోగు రామన్న, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినా హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఎంపీ సోయం బాపురావ్‌ విమర్శించారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్‌ రూరల్‌ మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కేసీఆర్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ మోసాలను ఎండగట్టడమే బీజేపీ లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,000 బూత్‌ స్థాయిలలో కార్నర్‌ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్‌ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో లాండసాంగ్వి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని గొప్పగా చెప్పినా ఎమ్మెల్యే రామన్న ఆ సమయంలో ఇచ్చినా హామీలను నేరవేర్చలేదన్నారు. అంతకు ముందు డప్పు వాయిద్యాలతో స్థానికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావ్‌ను, పాయల్‌ శంకర్‌లను శాలువలతో సత్కరించారు. బీజేపీ మండల నాయకులు జక్కుల బోజన్న, సంతోష్‌, విజయ్‌, మయూర్‌ చంద్ర, కేశవ్‌, అంకత్‌క్రిష్ణ, సుహాసిని రెడ్డి, జ్యోతి రెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ చేతిలో మళ్లీ మోసపోవద్దు

జైనథ్‌: సాధ్యం కానీ హామీలతో రెండు సార్లు అధికారంలోకి వచ్చి, ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్‌ చేతిలో మళ్లీ మోసపోవద్దని ఆదిలాబాద్‌ ఎంపీ సోయం బాపూరావ్‌ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కంఠ గ్రామంలో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్‌ మీటింగ్‌ పాల్గొని మాట్లాడారు. కేంద్రం నిధులను రాష్ట్రం నిధులుగా చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్‌ మాట్లాడారు. అంతకు ముందు కంఠ గ్రామంలో ఈజీఎస్‌ నిధులు రూ.1.50కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌రెడ్డి, నియోజక వర్గ ఇన్‌చార్జి విజయ్‌, మండల అధ్యక్షుడు కట్కం రాందాస్‌, నాయకులు అస్తక్‌ సుభాష్‌, విలాస్‌రెడ్డి ఉన్నారు.

'మంత్రి హరీశ్‌రావును అడ్డుకుంటాం'


మాట్లాడుతున్న సలాం వరుణ్‌, నాయకులు

ఆదిలాబాద్‌రూరల్‌: ఎస్టీ జాబితాలో 11 కులాలను కలుపుతూ తీర్మానించడాన్ని నిరసిస్తూ ఆదివాసీ గిరిజన ప్రజలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అందులో భాగంగానే మంత్రి హరీష్‌రావ్‌ బుధవారం బోథ్‌లో చేపట్టనున్న పర్యటనను అడ్డుకుంటామని ఆదివాసీ విద్యార్థి సంఘం నేతలు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినా సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి సలాం వరుణ్‌ మాట్లాడారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని తాము ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం మరో 11కులాలను చేర్చడానికి తీర్మానాలు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో ప్రగతి భవన్‌ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


భీమన్న

ఖానాపూర్‌: పట్టణంలోని శ్రీరాంనగర్‌ కాలనీకి చెందిన పంబాల భీమన్న ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఎస్సై ఆర్‌.శంకర్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... క్షణికావేశంలో ఇంట్లో గొడవపడి రాత్రి 8.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు బంధువులతో పాటు తదితర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో భీమన్న కుమారుడు నితీష్‌ ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

టీపీసీసీ మైనార్టీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శంషొద్దీన్‌

ఆదిలాబాద్‌టౌన్‌: టీపీసీసీ మైనార్టీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇచ్చోడ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ శంషొద్దీన్‌ను రాష్ట్ర కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ ఖాన్‌ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాజిద్‌ ఖాన్‌ మాట్లాడుతూ అధికారంలో లేకున్నప్పటికీ పార్టీ జెండాను మోస్తున్న కార్యకర్తలను పార్టీ అక్కున చేర్చుకుంటుందన్నారు. అనంతరం శంషొద్దీన్‌ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.


శంషొద్దీన్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న సాజిద్‌ఖాన్‌